# అంతరంగయాత్ర

**ANTHARANGA YATRA**

KRISHNAMURTI FOUNDATION INDIA AUGUST - NOVEMBER 2013 Rs. 2/- VOL. VIII ISSUE 1


## జె. కృష్ణమూర్తి బోధనలతో కూర్చిన ప్రచురణ




## 'అంతరంగయాత్ర' పాఠకులకు ప్రణామాలు

ఇప్పటివరకు కృష్ణమూర్తి ప్రసంగాలు, రచనలతో కూడిన సుమారు 20 సంపుటాలను తెలుగులోకి అనువదించి పాఠకులకు అందజేశాము. ఇప్పుడు ఇంగ్లీషులో శ్రీమతి పుపుల్ జయకర్ రచించిన 'కృష్ణమూర్తి, ఎ బయగ్రఫీ' అనే గ్రంధానికి తెలుగు అనువాదాన్ని 'జిడ్డు కృష్ణమూర్తి జీవిత చరిత్ర' అనే పేరుతో తెలుగు పాఠకులకు సమర్పిస్తున్నాము. శ్రీమతి పుపుల్ జయకర్ కృష్ణమూర్తి సన్నిహిత మిత్రులలో ఒకరు. అతడు ప్రత్యేకంగా సూచించిన మీదట ఆమె ఈ గ్రంధ రచన ఆరంభించారు. ఇంగ్లీషులో ఈ బయగ్రఫీ బహుళ ప్రజాదరణను పొందింది. కృష్ణమూర్తి బోధనలతో పరిచయం వున్నవారు, లేనివారు కూడా 'ఎవరీ కృష్ణమూర్తి? జన్మించినది ఎక్కడ? బాల్యంలో ఎలా వుండేవాడు? అతడి జీవితం ఎలా గడిచింది?' అని ప్రశ్నించుకుంటూ వుంటారు. వీటికి సమాధానమే కాకుండా, కృష్ణమూర్తి సన్నిహితులైన వారితో జరిపిన సంభాషణలు, చర్చలు, మానవ జీవితం గురించి, ప్రకృతి గురించి, సృష్టి మూలాల గురించి అతడు జరిపిన శోధన, అతడు ప్రసరించిన అంతర్దృష్టులు కూడా ఈ గ్రంథంలో ప్రముఖంగా కానవస్తాయి.

బ్రిటిషు పాలననుండి భారతదేశం స్వతంత్రమయాక దేశ పరిస్థితులు, స్వాతంత్ర్యోద్య మంలో పాల్గొన్న రాజకీయ నాయకులలో పొడసూపిన విభేదాలు, మానసిక సంఘర్షణలకు లోనైన ఆదర్శ వాదులు, పరపాలననుండి విముక్తి కోసం ఏకమైన జాతి ఇప్పుడు హక్కుల కోసం, పదవుల కోసం వివిధ వర్గాలుగా చీలి విద్వేషాలు పెంచుకోవడము, గాంధీజీ హత్యోదంతము మొదలైనవి నిశితమైన చారిత్రక పరిశీలనతో శ్రీమతి జయకర్ చిత్రించారు. అటువంటి పరిస్థితులలో కృష్ణమూర్తి స్పందించిన తీరు, మార్గనిర్దేశం కోరుతూ వచ్చిన వారితో జరిపిన చర్చలు ఆసక్తి కరంగా వుంటాయి.

"ఈ రాత్రి పర్వతాల వైపుగా చాలా దూరాలకు నడచి పోబోతున్నాను. మంచు తెరలు కమ్ముకొస్తున్నాయి" అని తన మరణం గురించి కృష్ణమూర్తి పలికిన పలుకులతో ఈ జీవిత చరిత్ర ముగుస్తుంది.

అనువాదం చేసినవారు శ్రీమతి సరోజినీ ప్రేమచంద్. అలకనంద ప్రచురణ సంస్థ ప్రచురించిన ఈ పుస్తకం అన్ని ప్రముఖ పుస్తక విక్రయ కేంద్రాలలోను లభిస్తుంది. లేదా అంటే కృష్ణమూర్తి ఫౌండేషన్ కేంద్ర కార్యాలయ మైన వసంతవిహార్, 124-126 గ్రీన్‌వేస్ రోడ్డు, చెన్నయి-600 028,కి వ్రాసి తెప్పించుకో వచ్చును.

ఈ సంచికలో 'జీవిత చరిత్ర'లో నుండి తీసిన కొన్ని భాగాలను ప్రచురిస్తున్నాము.

## రాష్ట్రపతి నివాసంలో కృష్ణమూర్తి

నవంబరు 2వ తేదీన మేము రాష్ట్రపతి భవనంలో మధ్యాహ్న భోజనానికి ఆహ్వానించబడ్డాం. దేశాధ్యక్షుల నివాసం అది. కృష్ణజీతో అచ్యుత్. నారాయణ్, నందిని, నేను తోడుగా వెళ్ళాం. కృష్ణజీ ఎర్రని అంచున్న ధోవతి కట్టుకొని, చేతితో నేసిన ముతకగా బెరడు రంగులో వున్న టస్సర్ వస్త్రంతో తయారు చేసిన జుబ్బా ధరించారు. భుజంమీద అంగ వస్త్రం కుదురుగా కూర్చున్నది. పొడవైన నిటారైన శరీరం. గంభీర వైఖరి, కరుణ వెదజల్లు తున్న ఆర్ద్రనేత్రాలు. కాంతిపుంజం లాంటి ఈ ఋషి సామ్రాజ్యాధినేతల భోగ భాగ్యాలకు ప్రతీకలా కనబడుతున్న ఆ రాజ ప్రాసాదంలోకి అడుగుపెట్టారు. అధ్యక్షులు సంజీవరెడ్డి కృష్ణజీని సగౌరవంగా ఆహ్వానించి, ఈ దేశ సంప్రదాయాల కనుగుణమైన అతిథి మర్యాదలు చేశారు. కృష్ణజీతో పరిచయం వున్న ఎస్. వెంకట్రామన్ సంభాషణ ఆరంభించారు. కొద్ది నిమిషాల అనంతరం ఇందిర వచ్చింది. చిన్న పిల్లలా పరుగుల నడకతో, తళతళ కాంతులీను తున్న కళ్ళతో కృష్ణజీని సమీపించి నమస్కరించింది.

భోజన సమయంలో పట్టుదలగా కృష్ణజీతో ఫ్రెంచి భాషలో మాట్లాడింది. కృష్ణజీకి ఫ్రెంచి క్షుణ్ణంగా వచ్చు. అతడి భాషలోని ఒక రకమైన ఆధునిక నాగరీకత ఇందిరను చాలా సంతోషపరచింది. అధ్యక్షుడికి ఇదంతా బొత్తిగా అర్థంకాక అతడిలో ఆశ్చర్యమూ కుతూహలమూ పెరగడం ఇందిర గమనిస్తూనే వున్నది. దగ్గరగా వంగి వినడానికి ప్రయత్నిస్తున్నాడు. ఫలితం లేక నిస్పృహ చెందుతున్నాడు. ఏం మాట్లాడుతున్నారో అతడికి అర్థమవడం లేదు. భోజనాలయాక కృష్ణజీని సాగనంప డానికి రాష్ట్రపతి భవన ద్వారం వరకు వచ్చాడు దేశాధ్యక్షుడు. ఎప్పటికీ మరచి పోలేని సంఘటన. కొంత వినోదపూరితంగా వున్నప్పటికీ.

## అచ్యుత్ పట్వర్థన్‌తో

రాజ్‌ఘాట్ వెళ్ళడానికి అచ్యుత్ అంగీక రించాడు. కృష్ణజీ మాటలు అతనిలో నాటు కొని పోయాయి. ఒక బోధకునిగా కృష్ణజీ మహత్వాన్ని అతడు గ్రహించాడు. అయితే సోషలిస్టు పూర్వరంగం వున్న అచ్యుత్‌కు కృష్ణజీ బోధనలు కొద్దిమందికి మాత్రమే పరిమితం అంటే నచ్చదు. రాజఘాట్ నేలలో కృష్ణజీ సమక్షం ఇంకి పోయి సారభూతం అవాలని అతడికి అనిపించింది. అది పవిత్ర క్షేత్రం. బుద్ధుడు అక్కడ నడిచాడు. గంగ వెనుకకు తన జన్మస్థానం వైపుగా మరలి, ఉత్తర దిశగా తన ప్రయాణాన్ని ఆరంభించిన ఆ పావన స్థలంలో నిలబడి, వంపు తిరిగిన నదీ జలాలపై సూర్యోదయాన్ని కృష్ణజీ పరికించారు. కృష్ణజీ మాట వెనుక వున్న ఆ పవిత్రతను, పొంగి పొరలి ప్రవహించే ఆ కారుణ్యాన్ని నిర్వాచ్యంగా ఆ గ్రామీణులకు అందజేయాలి. మత్స్యకారులకు, నేత పనివారికి, పవిత్ర గంగా తీరభూములను సాగుచేస్తున్న కృషీవలులకు ప్రసరింప జేయాలి. ఇది జరగకుండా రాజఘాటులో సుస్థిరత నెలకొల్పలేమని రాజకీయాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసిన అచ్యుత్ మనసుకు తెలుసు. సుస్థిరత లేనట్లయితే బోధనలకు సంబంధించిన పని కూడా సాధ్యమవదు. అచ్యుత్ రాజకీయ జీవితమూ, అతడి పూర్వ రంగమూ లోకవిదితం. స్వాతంత్ర్య సంపాదన కోసం హింసకు పాల్పడటానికి వెనుదీయలేదు. విప్లవకారుల అంతరిక బాహిర క్రియాచరణ పద్ధతులన్నీ అతడు చవిచూశాడు. అతడి పేరు చెప్తేనే స్వాతంత్రోద్యమపు ఉద్రేకాతిశయమూ, ఆ విప్లవ జ్వాలలూ ప్రతిధ్వనిస్తాయి. ఇప్పుడా విప్లవవీరుడు తన ఆత్మకు కాషాయాంబరాలు ధరింపజేశాడు. ఈ అనూహ్య పరావర్తనం అనేకమంది అతడి సోషలిస్టు సహచరు లనూ, పండిట్ జవహర్‌లాల్ నెహ్రూనూ కూడా విభ్రాంతి పరచింది. భారతదేశపు గ్రామాల్లో పనిచేయడానికి అచ్యుత్ కంటే ఉత్తమ సముచిత వ్యక్తి మరొకరు లేరు.

> "మనసుకు సృజనాత్మకత కలగాలంటే నిశ్చలత, నెమ్మది వుండి తీరాలి. ప్రగాఢమైన నిశ్చలనత. నీ ఒంటరి తనాన్ని నీవు నేరుగా ఎదుర్కొన్నప్పుడు మాత్రమే జనిస్తుంది ఆ నిశ్చలనత."

## అతడి సమక్షంలో

చంద్రకాంతి లేని కారుచీకటి రాత్రులలో మేము బయటకు వెళ్ళి నక్షత్రాలను గమనిస్తుండే వారం. అంతరిక్షపు అజ్ఞాత అగాధాల్లోకి తొంగి చూస్తుండే వారం. తారా సముదాయాలను చూసి నక్షత్ర రాశుల పేర్లను నాకు వివరిస్తుండేవారు. అనంతత్వపు ఆవిష్కరణకు అటు అంతరిక్ష పయనమూ ఇటు అంతరంగ యాత్రాలను గురించి మాట్లాడుతుండేవారు. అయితే అల్పంగా వుండే మనసు ఇటువంటి కాలరహిత అనంతత్వపు యాత్రను చేపట్టలేదని కూడా అనేవారు.

ప్రతి సాయంత్రమూ ఒక మహత్తర అనుగ్రహం.

రాత్రి భోజనమయాక, పెట్రొమాక్సు దీపపు వెలుగులో గోల్డెన్ ట్రెషరీ కవితా సంపుటినుండి కవితలు చదువుతుండేవారు. కీట్సు రచన 'ఓడ్ టు నైటింగేలు' (గాన కోకిలకు నివాళి) కెకు అత్యంత ప్రియమైన కవిత. రాత్రిళ్ళు చలి బాగా వుండేది. కట్టె పుల్లలూ, ఎండిపోయిన పైనుకాయలూ వేసి చలిమంట వేసుకునేవారం. ఎప్పుడైనా సంస్కృత శ్లోకాలు కూడా రాగయుక్తంగా చదువుతుండేవారు. గంభీరమైన అతడి కంఠధ్వనితో చదివిన ఆ మంత్రస్వనాలు గదిని నింపివేసేవి. వరి పొలాలలో ప్రతి ధ్వనించేవి. మంచు పర్వతాల ఆవలి తీరాలను వెళ్ళి స్పృశించేవి. అతడి స్ఫటిక స్వచ్ఛమైన సమక్షంలో వినడము, చూడటము నవ వికసనం చెందుతుండేవి.

## లామారింపొచె

కృష్ణజీని కొన్ని ఏళ్ళపాటు విన్నాక ప్రధాన మూలప్రశ్నలకు జవాబులు వుండవన్న సంగతి ఆ లామా (రింపొచె సంథంగ్) గ్రహించాడట. అయితే ఆ ప్రశ్నలను అడుగు తూనే వుండాలి కూడా. "కృష్ణజీ ఎప్పుడూ సమాధానాలు మన చేతికి అందివ్వరు. మనిషిలో వాటిని జొరపరు. అయితే అతడి సవాలు మనిషి లోపల వున్న బీజస్థానాన్ని వెళ్ళి స్పృశిస్తుంది. ఇది శ్రోతను జాగృతం చేస్తుంది. 'ఉన్నది' ఏదో అది తెరచుకొని వికసిస్తుంది" అని రింపొచె అంటారు.

ఇంకా ఇట్లా అంటారు. "కృష్ణజీ నుండి ప్రవహిస్తున్న కరుణను మనం అనుభూతి చెందగలుగుతే అప్పుడు అతడికి అవధులు లేవని చూడగలుగుతాం. సాధారణంగా గురువులకు ఒక పరిమితమైన దృక్పథం వుంటుంది. కాని కృష్ణజీ దృక్పథం మాత్రం పరిమితులకు అతీతంగా వుంటుంది." కృష్ణజీ సమక్షమూ అతడి మాటలూ రింపొచెను చాలా ప్రగాఢంగా తాకాయి. "మనకు అంతర్దృష్టి కలుగుతున్న కొద్దీ, కృష్ణజీని సమీపించిన కొద్దీ అతడు ఇంకా ఎక్కడికో దూరంగా వెళ్ళిపోతుంటారు. ఇంకా లోతైన అంతర్ గ్రాహ్యతలలోకి. మనం అతడిని పట్టుకో లేము. అతడికి సన్నిహితంగా సమీపించ లేము. ఎందుకంటే అతడు అనంతుడు, అతడు అపరిమితుడు."

## ఒక హాస్యకథ

భోజన సమయంలో వాతావరణం తేలిక పరచడానికి కృష్ణజీ కథలు చెప్పడం మొదలు పెట్టారు. సెయింటు పీటరూ, స్వర్గలోకమూ గురించినవి. వాటిలో ఒక కథ నాకు బాగా గుర్తుంది. ఎన్నో దానధర్మాలు చేసిన ఒక గొప్ప ధనవంతుడు చనిపోయాడు. అతడు స్వర్గ ద్వారాల వద్దకు చేరాడు. అక్కడ కాపలా కాస్తున్న పీటర్‌ను కలిశాడు. తన అర్హతలు చెప్పుకున్నాక, లోపలకు ప్రవేశించడానికి పీటర్ అతడికి అనుమతి నిచ్చి ఇట్లా అడిగాడు. ప్రవేశించే ముందు ఒకసారి కింది లోకానికి కూడా వెళ్ళి అక్కడ ఎలా వుంటుందో చూసి రావాలని లేదా? అని. "తప్పకుండా చూస్తాను. అక్కడికి వెళ్ళడం తేలికేనా?" అని ధనవంతుడు అడిగాడు. "ఏమీ కష్టంలేదు. ఆ మీట నొక్కితే యంత్రంతో పనిచేసే మెట్ల వరుస (ఎలివేటర్) మిమ్మల్ని కిందకు తీసుకు వెళ్తుంది" అన్నాడు పీటర్. కిందకు వెళ్ళగానే అధోలోకానికి తలుపులు తెరచుకున్నాయి. లోపల రంగు రంగుల పూలచెట్లున్న తోట, సెలయేర్లు, రకరకాల మధుర పానీయాలు, రుచికరమైన తినుబండారాలు అందివ్వ డానికి సిద్ధంగా వున్న సుందరాంగులైన యువతీమణులు ధనవంతునికి కనిపించారు. అత్యంత రమణీయమైన ఆ సుందర వనాల్లో కొంతసేపు గడిపాక, అతడు పీటరు వద్దకు తిరిగి వచ్చి, అధోలోకమే ఎంతో సరదాగా బాగున్నదే అని అంటూ తను అక్కడే వుండిపోవాలని నిశ్చయించుకున్నానన్నాడు. "దానికేం, అలాగే. నీవు అలా భావిస్తావనే నేను అనుకున్నాను'' అన్నాడు పీటర్. అందుకని ఆ ధనవంతుడు మళ్ళీ మీట నొక్కి అధోలోకానికి వెళ్ళాడు. తలుపులు తెరచు కున్నాయి. ఆ తోట మాయమైంది. వస్తాడు

ల్లాంటి ఇద్దరు తయారుగా నిలబడి వున్నారు. ఇతడు వెళ్ళగానే పట్టుకొని బాదారు. ధన వంతుడు వాళ్ళని ఆపాలని ప్రయత్నించాడు. దెబ్బల మధ్య ఆయాసపడుతూ, "ఏం జరిగింది ఇక్కడ? కొద్ది నిమిషాల క్రితం ఇక్కడకు వచ్చినప్పుడు నన్ను పరమ ఆదరంగా ఆహ్వానించారు కదా!" అన్నాడు.

"ఓ, అదా" అంటూ మళ్ళీ ఇంకో దెబ్బ గట్టిగా తగిలిస్తూ, "అప్పుడు నీవు చూడటానికి వచ్చిన పర్యాటకుడివి కదా!" అన్నారు.

అందరూ నవ్వారు.

## ఇందిరాగాంధీ

తరువాత ఎప్పుడో ఒకసారి నాతో మాట్లాడుతూ ఇందిర (ఇందిరా గాంధీ) చెప్పింది. ఏమిటంటే, తను రెండవసారి కృష్ణజీని కలిసి నప్పుడు, 1976 అక్టోబరు 28న, తన లోలోపల ఒక సన్నని కదలిక ఏదో జాగృతమై, పర్యవసానం ఏమైనా సరే ఎమర్జెన్సీని అంతం చేయమని సూచించిందని. ఈ అంతర్గతమైన భావనా కదలికను గురించి ఎంతగానో యోచించి మధనపడింది. తనకు సన్నిహితులైన కొద్ది మందితో ఈ విషయం గురించి మాట్లాడి చూసింది. ఇక చివరకు ఎన్నికలు ప్రకటించే నిర్ణయం తీసుకున్నది.

## హిమాలయ ప్రాంతంలో

రాణీఖేట్‌లో ఒక వంటమనిషి మాత్రం అతడి అవసరాలు కనిపెట్టేందుకు వుండే వాడు. ఇలా ఒంటరిగా నివసిస్తూ కృష్ణజీ తనను తాను పునర్నవ్యత్వంతో నింపు కున్నారు. కాలినడకన నడుస్తూ చాలా దూరాలకు వెళ్ళేవారు. మంచు శిఖరాలతో సంభాషిస్తుండేవారు. తన లోపలి ప్రపంచాన్ని, తన చుట్టూ వున్న ప్రపంచాన్నీ పరికిస్తూ, వింటూ వుండేవారు. ఒకసారి పెద్ద కోతుల గుంపు కథ ఒకటి మాకు వినిపించారు. ఆర్ది (నివాస గృహం) చుట్టు ప్రక్కల వున్న వృక్షశాఖల మీద నల్లని ముఖం గల కోతులు ఉయ్యాలలూగుతూ వేళ్ళాడు తుంటాయి. ఒక వుదయంపూట కృష్ణజీ ఏదో రాసుకుంటున్నారు. కిటికీ తెరచిపెట్టి వున్నది. హఠాత్తుగా అతడికి అనిపించిందట. ఏవో కన్నులు తనను చూపు మరల్చకుండా, రెప్ప వాల్చకుండా దీక్షగా చూస్తున్నాయని. తల ఎత్తి చూస్తే, బాగా ఎదిగి ధృడంగా వున్న కోతి ఒకటి కిటికీ సెజ్జమీద కూర్చొని గదిలోకి చాలా తీక్షణతతో చూస్తున్నదట. కృష్ణజీ లేచి కోతి వున్న చోటికి నడిచారు. ఇద్దరూ ఎదురెదురుగా నిలబడినప్పుడు కోతి తన చేతిని చాచింది. కృష్ణజీ ఆ చేతిని తన చేతిలోకి తీసుకున్నారు. కోతి తన చేతిని అలాగే పట్టుకోనిచ్చింది. సంపూర్ణమైన విశ్వాసంతో వుండిపోయింది. దాని హస్తస్పర్శ చాలా ధృడంగాను, చెట్ల కొమ్మలు ఎక్కు తూండటం వలన చేతులు కాయలు కాచి వున్నప్పటికీ వర్ణించలేనంత మృదువుగాను వున్నదని కృష్ణజీ అన్నారు. పరస్పరం చేతులు కలుపుకొని ఇద్దరు కొన్ని నిమిషాలు వుండిపోయారు. అప్పుడు ఆ పెద్దకోతి గదిలో ప్రవేశించాలని ప్రయత్నించింది. మెత్తగానే కానీ కొంచెం గట్టిదనం కూడా చూపుతూ కృష్ణజీ కోతిని బయటకు నెట్టివేసి కిటికీ తలుపు వేసేశారు.

## ఋషివేలిలో

కొండలమీద ఎత్తుగా వున్న అస్తాచలం అనే చోట పిల్లలందరూ చేరి క్షితిజరేఖ మీద నుండి సూర్యుడు క్రిందికి జారి అంతర్ధాన మవడం ప్రత్యక్షంగా వీక్షిస్తున్నారు. చిత్ర వర్ణాలు విస్ఫోటం చెందడం వారి అంత రంగపు సీమలో అనుభూతించారు. తమ మధ్య కూర్చున్న నూతన ఆగంతుకుని సమక్షాన్నీ, అతడిని ఆహ్వానిస్తూ ఆకాశం ప్రజ్వరిల్లడమూ మౌనంతో గ్రహించారు.

## పుత్రశోకంలో వున్న మార్క్సిస్టు మేధావితో

బొంబాయిలో వుండగా, 1958 జనవరిలో ఒక రోజు రావుసాహెబు పట్వర్ధన్ ఒక మిత్రుడిని వెంటబెట్టుకొని కె వద్దకు వచ్చారు. అతడు పి. వై. దేశ్‌పాండే. న్యాయవాది, రచయిత, మార్క్సిస్టు సిద్ధాంతాలు బాగా అధ్యయనం చేసినవాడు. లోతైన పాండిత్యం కూడా వున్న అతడికి మార్క్సిజంలో నమ్మకం ఈ మధ్య కాలంలో సన్నగిల్లింది. కృష్ణజీతో మాట్లాడాలని వచ్చాడు. అతడి మేధాశక్తి, ఆవేశ ఆగ్రహాలు ప్రసిద్ధి. దేశ్‌పాండే భార్య విమలాతాయిని కూడా తీసుకొని మరీ వచ్చాడు. వారిని పెనుశోకం తునాతునకలు చేసింది. కొడుకు చనిపోయాడు. మార్క్సిజం ఈ విషయంలో మూగబోయింది. ఇప్పుడు తన గతకాలపు బ్రాహ్మణత్వం వైపు దృష్టి సారించాడు. అతడూ అతడి భార్య కలసి వేదాలు, ఉపనిషత్తులు పఠించారు. ఋగ్వేదంలో సృష్టి ఆరంభాన్ని వర్ణించే మంత్రాలు వారిలో ఒక హఠాత్ కనువిప్పును రగిలించాయి. ఈ సృష్టిసూక్తం శ్లోకాలకు దేశ్‌పాండే వ్యాఖ్యానం రచించాడు. దాని ద్వారా రావు పట్వర్ధన్‌తో పరిచయం కలిగింది.

హిమ్మత్ నివాస్ వచ్చి దేశ్‌పాండే, భార్య కృష్ణజీని కలుసుకున్నారు. దేశ్‌పాండేది అర్భక శరీరం. బక్కచిక్కిపోయిన ముఖం మీద దుః ఖం రేఖలు గీసింది. అయితే అతడిలోని ఆత్మోత్సాహం అబ్బురపరుస్తుంది. ప్రాణశక్తితో త్రుళ్ళుతున్నట్లుంటుంది. 'నేను మార్క్స్ సిద్ధాంతాన్ని నమ్ముతాను. మీతో చర్చించి అటో ఇటో తేల్చుకోదలుచుకున్నాను. ఏ అడ్డుగోడలకు తావునీయకుండా మీతో మాట్లాడుతాను. మీరు చెప్పేది సత్యమైతే కనుక మార్క్సిజంను వదిలేసి మీతో చేరుతాను' అని దేశ్‌పాండే కృష్ణజీతో అన్నాడు.

దేశ్‌పాండే ఆ తరువాత నాకు చెప్పిన దానినిబట్టి అతడు కృష్ణజీతో మాటలతో కుస్తీ పట్టాలని ఎంతో ప్రయత్నించాడుట. కృష్ణజీని ఎంత సవాలు చేసినా, అటువైపున, ఎదుటి పక్షంలో యుద్ధం చేయడానికి ఎవరూ నిలబడలేదు. దానితో దేశ్‌పాండేకి కోపమూ, నిరుత్సాహమూ పెచ్చుపెరిగాయి. అతడు ఇంకా బలంగా, తీవ్రంగా, ఆవేశంతో వాదిస్తున్న కొద్దీ ఎదుటి పక్షం మరింత ఖాళీగా వున్నట్లు అతడికి అర్థమవుతున్నది. అకస్మాత్తుగా అతడి అన్వేషణ అంతా ముగిసి పోయింది. కృష్ణజీ చెప్పడం మొదలు పెట్టారట. "సమస్య మార్క్సిజం కాదు. పుత్రుని మరణం సమస్య." దేశ్‌పాండే, భార్య ఏమీ మాట్లాడలేకపోయారు.

వాదాలు మాని వింటున్నారు. "మనం దానిని గురించి మాట్లాడుదాం. మీ శోకం గురించి" అన్నారు కృష్ణజీ.

వారిద్దరూ కృష్ణజీ ముందు నిశ్శబ్దంగా కూర్చుండి పోయారు. కృష్ణజీ మరణం గురించి మాట్లాడారు. మాటలు ముగిశాక వారిద్దరూ తడిసిపోయిన కన్నులతో బయటకు నడిచారు. రావు వారిని చూసి "ఏమిటి, ఎట్లా వున్నారు?" అని ఆదుర్దాగా అడిగాడు. "సమస్యలన్నీ అంతమైపోయాయి" అన్నాడు దేశ్‌పాండే. వారిద్దరూ నాగపూర్ తిరిగి వెళ్ళి, సామాన్లు అన్నీ సర్దుకొని గంగానది ఒడ్డుపై వున్న సరాయి మోహనకు వచ్చారు.

ఒక పర్ణశాలలో నివసిస్తూ,రాజఘాట్‌లో జరుగుతున్న సమస్త కార్యకలాపాలలోనూ పాలుపంచుకొని సహకారం అందిస్తూ జీవితం గడుపుతున్నారు.

## శ్రీమతి అనీబెసెంటు

వారిద్దరి జీవితాలు ఎంతో దగ్గిరగా అల్లుకొని పోయాయి. అయినా శ్రీమతి బెసెంటు, ఆమె దత్తపుత్రుడు కృష్ణ కలిసి గడిపిన రోజులు మాత్రం చాలా కొద్ది. కానీ మొదటి రోజుల నుంచీ శ్రీమతి బెసెంటు కృష్ణకు రాసిన ఉత్తరాలలో గాఢమైన ఆమె ప్రేమ కెరటాలు ఆ చిన్న పిల్లవాడిని హత్తుకొని, ఆవరించు కొని, పొదువుకుంటూ, రక్షించుకుంటూ పొంగి ప్రవహిస్తుండేవి.

దేశకాలాలకు అతీతమైనఅనుబంధాలు వారిద్దరి మధ్యా ఏర్పడిపోయాయి. బాల్యంలో వారానికి ఒక ఉత్తరం చొప్పున 'కె' రాస్తుండే వాడు. తన స్వప్నాలు, తన చదువూ, తన దైనందిన జీవితం, ఎదుర్కొంటున్న చిన్న చిన్న సమస్యలూ అన్నీ ఆ ఉత్తరాల్లో వర్ణించి రాసేవాడు. ప్రథమంగా ఆమె ఒక తల్లి. అతడికి ఏ హాని జరుగుతుందో అని ఆందోళన పడుతున్న తల్లి. ఆ పైన ఉపాధ్యాయిని. సంవత్సరాలు గడచిన కొద్దీ కొన్నిసార్లు ఆమె శిష్యురాలి పాత్రను కూడా వహిస్తూ వుండేది. అతని పాదాల వద్ద కూర్చొని, అతని మాటలు వింటూ వుండేది. అతడి లేఖల్లో ఆమె ఎడల ఎంతో ఆత్మీయత, అదే సమయంలో ఉన్నతమైన గౌరవభావము కనబడతాయి. కృష్ణకు ఆమెపైన గల ప్రేమ, అభిమానము అతడి జీవిత కాలమంతా ఏమాత్రం తగ్గిపోకుండా ఒకే రకంగా నిలచిపోయాయి.

అతడిపైన ఆమె ప్రభావం వున్నది. అయితే ఆ ప్రభావం అతడి మనసు, బోధనల స్వరూప స్వభావాలను మలచి మార్చలేదు. వాటి దిశాగమనాన్ని మరలించనూ లేదు. ఆమె ప్రేమ అతడికి ఒక సంపూర్ణమైన రక్షణ కవచం ఏర్పడటానికి ఆధారభూతమైంది. నిస్వార్థపూరమైన ఆమె ప్రేమలోని చల్లని ఆదరణ అతడి బాల్యాన్ని ఎప్పుడూ ఒకేలా సంరక్షించింది.

> "కంప్యూటర్ చేయలేనిది, మనిషి చేయ గలిగినది ఒక్కటే. సాంధ్యతార వైపు దృష్టి సారించి చూడటం."

## అతడి సహజ స్వభావం

అడపాదడపా ఇటువంటివి జరగనివ్వడం కృష్ణమూర్తికి చెందిన నిగూఢతలో ఒక భాగం. గట్టిగా నొక్కి చెప్తూ నమాధాన మివ్వడం కానీ, దూకుడుగా చర్య తీసుకోవడం గానీ అతడి స్వభావంలో లేని అసంభావ్యాలు. ఒళ్ళు మరచేటంతగా కోపగించడం ఎప్పుడూ జరగలేదు. మృదువయిన మనసు, అహం లేకపోవడమూ, చుట్టూ వున్న వారిని సంపూర్ణంగా నమ్మడమూ వంటి స్వభావ గుణాలవల్ల అతడిని తక్కినవారు లెక్కచేసే వారు కారు. సన్నిహితంగా వుండే మిత్రులు ఏ కాగితం తీసుకొని వచ్చి సంతకం పెట్టమన్నా వెంటనే పెట్టేసేవాడు. ఒక్కొక్క సారి వారు వెలిబుచ్చే అసమంజస మైన వాటికి కూడా తల వూపేవాడు. ఇవి రకరకాలైన పరస్పరవైరుధ్య భరితమైన ప్రకటనలకు, చర్యలకు దారి తీసేవి. మిత్రులను అయోమయంలో పడవేసేవి. అతడి చుట్టూరా పూర్తిగా ఒక దడికట్టి వారి అజమాయిషీలో అతడిని వుంచేసుకున్నట్లు కనిపించినా హఠాత్తుగా పరిస్థితులు విచ్ఛేదనం చెంది చిక్కులన్నింటినీ ఎగర గొట్టేసేవి. ఏవీ అంటించుకోకుండా కృష్ణమూర్తి బయటపడేవాడు. స్వేచ్ఛగా ముందుకు కదలిపోయేవాడు. అతడి మీద పెత్తనం చేసినవారు ఆగ్రహంలో, విభ్రాంతిలో మునిగి మిగిలిపోయేవారు. కొందరు తట్టుకో లేక క్రుంగిపోయేవారు.

## వినోబాభావే

ఆగస్టు 14వ తేదీ (1959) సాయంత్రం వేళ వినోబాజీ పహల్‌గాంలో తన ఉపన్యాసం వినడానికి వచ్చిన ప్రజల నుద్దేశిస్తూ మాట్లాడారు. అతడి ప్రసంగం క్రొత్త విభిన్న దిశగా నడిచింది. ఇది తను కృష్ణజీని కలసి చర్చించడం కారణంగా తనపై కలిగిన ప్రభావం అని వినోబాజీ స్వయంగా ఒప్పు కున్నారు. కృష్ణజీ వంటివారు మనల్ని కాపాడే భద్రాత్మకులు, ముక్తిప్రదాతలు అనీ, వారి బోధలూ వారి సత్‌వాక్యాలూ హెచ్చరికలుగా, మార్గజ్యోతులుగా తీసుకోవాలనీ, ప్రగాఢమైన మనస్సుతో ఆపత్కాలపు సూచనలుగా వాటిని విని గ్రహించాలనీ వినోబాజీ అన్నారు.

## సంప్రదాయాలు

కృష్ణజీ దృష్టిలో నది సమస్త సంప్రదాయా లకు సంకేతం. ఆధునిక సంప్రదాయాలకు, అతిపురాతనమైన వాటికీ కూడా. సంప్రదాయ పరంపరలు అవి ఎంత ప్రాచీనమైనవి అయినా, ఎంత ఉత్తమోత్తమమైనవి అయినా సరే, అవి మనిషిని నిబద్ధుడిని చేస్తాయి. "నాకు ఒక కుమారుడు కనుక వుంటే, మనం ఇంగ్లండులో వున్నా, ఫ్రాన్సులో వున్నా, మరెక్కడ వున్నా నా సంతానం బాధ్యత నాదే అని భావిస్తుంటాం కాబట్టి, ఈ రెండు ప్రవాహాలలో నుండి, ఒకదాని కొకటి సమాంతరంగా ప్రవహిస్తున్నట్లు కనబడే ఈ రెండింటిలో నుండి నా పుత్రుడు బయట పడేందుకు నేను తోడ్పడుతాను. యువతీ యువకులు ఈ అన్ని రకాల ప్రవాహాలనుండి విడుదల పొందడం ముఖ్య అవసరం కాదా?" అని ప్రశ్నించారు.

> "ఈ చావు పుట్టుకలకు మించిన అపారమైన మహత్తరమైనది ఏదో వున్నదని మనం గ్రహించాలి. అది మనం తెలుసుకొని తీరాలి."

## మంచి మనసు

"మంచి మనసుకు ఒక కేంద్ర బిందువు, తన చర్యలన్నింటికి కేంద్రమైన ఒక కేంద్ర బిందువు వుండదని అనవచ్చునా? ఈ కేంద్రమే స్వ-స్వీయం.......మంచి మనసుకు స్వీయం (తాను) అనేది వుండదు. సంపూర్ణ మైన సావధాన స్థితిలో మనసు వున్నప్పుడు, శ్రద్ధతో ధ్యాసతో వింటున్నప్పుడు, అప్పుడు మనసులో స్వీయానికి ఏ మాత్రం స్థానం వుండదు. ఆ తరువాత స్వీయం తనను తాను ప్రత్యక్షపరచు కుంటుంది. ఇక్కడ కీలకం వినడం. మెదడును పరిపోషించి ఆరోగ్యంగా వుంచడంలో వినడం పాత్ర కూడా గొప్పది. చూడండి, మంచి మనసుకు కారుణ్యం వుండాలి. గొప్ప సౌందర్య గ్రహీణత వుండాలి. క్రియను చేసే శక్తిసామర్థ్యాలు వుండాలి. సవ్యమైన పరస్పర బాంధవ్యాలు వుండి తీరాలి. అటువంటి మనసులు వుండటం అసాధ్యమా? అరిస్టాటిల్, సోక్రటీసు–వారివి మంచి మనసులు."

# అంతమవడంలో నుండి ఒక క్రొత్తదనం వస్తుంది

(గతసంచిక తరువాయి)

సంకల్పపు క్రియ అయినటువంటి ప్రతి రోధం ఏ పని చేసినా సరే, అది ఈ 'నా', ఈ 'నేను', ఈ స్వీయకేంద్రిత చర్యలు జరుపుతున్న స్థలాన్ని వేరుగా విడదీసి సంకుచితంగా తయారుచేస్తుంది. ఇది గ్రహించారా? కాబట్టి ద్వైతభావం ఏర్పడు తున్నది. 'నేను' – 'నేను కానిది'. ప్రతిరోధపు గోడకు అవతలగా వున్నదీ, గోడకు లోపలగా వున్న 'నేనూ'. ఆధిక్యత ప్రకటించు కోవడంలో, బలాధిక్యపు చలాయింపులో, ఆకాంక్షా పరత్వంలో, అధికార తృష్ణలో, పదవి ప్రతిష్ఠల కోసం పరుగులో ఉన్నది సంకల్పమే. అందుచేత, మనసు ఎంత చిన్నదై పోయిందో, ఎంత సంకుచితమై పోయిందో, తన కార్యకలాపాలను ఒక చిన్న స్థలానికే ఎట్లా పరిమితం చేసుకున్నదో చూడండి. మేధాపరంగా, వాచ్యపరంగా, తార్కికంగా చూడటం కాదు. ఈ స్థలం చిన్నగా, ఇరుకుగా, పరిమితంగా వున్నంతవరకు సంఘర్షణ వుండి తీరుతుంది. అందుచేత ఖాళీ ప్రదేశం వుండదు.

సరే, సంకల్పం లేకుండా జరిగే చర్య ఏదైనా వున్నదా? సాధారణంగా అందరూ ఈ సంకల్ప క్రియ పైన ఆధారపడే పెరుగుతారు. 'నేను ఇది తప్పక చేయాలి', 'ఇది నాకు కూడదు'. అందుచేత 'తప్పనిసరి', 'కూడదు', 'చేయాలి', 'చేయకూడదు' అనేవి ఒక రకమైన ప్రతిరోధ రూపాలు. అటువంటి చర్యలన్నీ సంకల్పజనితాలే. అందుచేత అవి కొన్ని పరిమితులకు లోబడి వుంటాయి. సరే, ఇట్లా చూడండి. మీకు పొగతాగే అలవాటు వున్నది. 'నేను ధూమ్రపానం చేయను' అని కనుక మీరు దానికి ప్రతిరోధం చూపుతే అప్పుడు సంఘర్షణ వుంటుంది. ప్రతిరోధం లేకుండా ఆ అలవాటును వదిలేయగలరా? అంటే సంకల్పం అనేది బొత్తిగా లేకుండా? అలవాటు అవడం అనే ఆ యాంత్రికత యొక్క సమస్త స్వభావాన్ని అర్థంచేసు కున్నప్పుడు మాత్రమే ఆ అలవాటును వదిలేయగలుగుతారు.

కాబట్టి, కాలపు ఉనికి – అంటే మానసిక కాలం అనే అర్థంలో – ఏ మాత్రమూ లేనటువంటి విశాల స్థలంలో మాత్రమే ఎటువంటి సంఘర్షణా వుండదు. అటువంటి వైశాల్యంలో ప్రతిరోధ క్రియ లేకుండా, సంకల్ప చర్య లేకుండా మీరు పనిచేయగలుగుతారు. చూడండి, ఒక కొత్త జీవనరీతిని, ఒక కొత్త క్రియామార్గాన్ని మనం కనిపెట్టాలి. పాత సాంప్రదాయిక మార్గం నవ్యక్రియకు దారితీయదు. పాతది మళ్ళీ మళ్ళీ జరిగే పునరుక్తి. పూర్తిగా విభిన్న మైన తీరును కనిపెట్టాలన్నా, విభిన్నమైన తీరులో చర్య జరపాలన్నా మనసు ఎటు వంటిదై వుండాలంటే, అక్కడ పూర్తిగా నిరాటంకమైన స్వేచ్ఛా వైశాల్యాలు గల ఎడం పరచుకొని వుండాలి. అంతేనంటారా? కాబట్టి కాలమే ఆలోచన. పైగా కాలమే దుఃఖమూ.

ఈ అవగాహనతో ఇప్పుడు, మరణం అంటే ఏమిటి అని చూద్దాం. లేదా ప్రేమ అంటే ఏమిటి అనేది ముందుగా చూద్దామా? ప్రేమ అంటే ఏమిటో కనుక తెలియకపోతే మరణం అంటే కూడా తెలియదు. సర్! ప్రేమ అంటే ఏమిటి? ప్రేమ అంటే సుఖమూ సంతోషమా? కోరికే ప్రేమా? ప్రేమ అంటే సెక్స్‌కు సంబంధించినదా? ప్రేమ అని మనం అంటున్న ఈ ఇది ఏమిటి? ఇది ద్వేషంలో భాగమా? ఇందులో అసూయ వుంటుందా, ఆందోళన వుంటుందా? ఆకాంక్షలతో నిండిపోయి, అధికారమూ అంతస్థూ కాంక్షించే మనిషికి ప్రేమ అంటే ఏమిటో తెలుస్తుందా? 'నాకు నా కుటుంబంపై ప్రేమ, నా భార్య మీద ప్రేమ, ఒక యువతిపై ప్రేమ, ఒక యువకుడిపై ప్రేమ' అని ఒకరు అంటున్నప్పుడు దాని అర్థం ఏమిటి? ఈ మాటకు అర్థం ఏమిటి అనేది మీకు మీరే నిజంగానే బాగా లోతుగా తెలుసుకోకపోతే మరణం యొక్క అర్థాన్ని, దాని లోతులను ఎప్పటికైనా మీరు ఎట్లా కనిపెట్ట గలుగుతారు? ప్రేమ కాలంతో ముడిపడిన విషయమా, అలవరచుకో గలిగినదా, అభ్యాసం చేసి నేర్చుకునే సంగతా? రోజూ అభ్యాసం చేస్తే వస్తుందని మీరు అనుకుంటున్నారా? దీనిని గురించి ఏంచేయాలో మీ గురువుగారు బోధించే విషయమా ఇది? ఆయన చెప్పినది విన్నాక మీరు ప్రేమను సాధిస్తారా? ప్రేమ ఆలోచనకు, కాలానికి ఒక ప్రక్రియకు ఫలితంగా వస్తుందా?

ప్రపంచమంతటా మానవులు సెక్స్‌కు ఎందుకని ఇంత విపరీతమైన ప్రాముఖ్యాన్ని ఇస్తున్నారు? దానినే ప్రేమ అని ఎందు కంటున్నారు? మీ జీవితాన్నే తీసుకోండి. ఎందుకని సెక్స్ అన్నింటినీ తలదన్నేంత అమిత ప్రాధాన్యాన్ని సంతరించుకున్నది? ఈ సంగతి మీరు గమనించారా? సర్, ఎందుకని? దీనికి జవాబు చెప్పండి. అది కనిపెట్టాలంటే నిత్యజీవితంలోని సంఘర్షణ లతో, బాధలు దారుణ వేదనలతో, పాశవికతతో మీ జీవితం ఇంతయాంత్రికంగా ఎందుకు అయిందని ప్రశ్నించుకోవాలి. మీ జీవితం మహా యాంత్రికంగా వున్నది కదూ! లేదా? ప్రతిరోజూ ఆఫీసుకు వెళ్ళడం, ప్రతి రోజూ ఆచార సంప్రదాయాలు పాటించడం, ఒకే రకమైన కార్యకలాపాలతో కూడిన ఒక పద్ధతిని స్థాపించుకోవడం, ఇక తక్కిన జీవిత కాలమంతా అదే అనుసరించడం, కొన్ని నమ్మకాలు పెట్టుకోవడం–దేవుడు వున్నాడు, దేవుడు లేడు, పరమాత్మ, అధమాత్మ మొదలైనవి–ఆ చెత్త అంతా మీకు తెలుసు. ఒక అలవాటును అలవరచుకుంటారు. ఇక అదే మళ్ళీ మళ్ళీ చేస్తూ చేస్తూ చేస్తూ పోతారు.

చూడండి, 'నాకు తెలియని విషయాన్ని, నాకే పూర్తిగా అర్థమవని విషయాన్ని ఇక ఎన్నటికీ మళ్ళీ మళ్ళీ పునరుక్తం చేస్తూ మాట్లాడను' అని కనుక మీ అంతట మీరే అంటే ఎంత అద్భుతంగా వుంటుందో తెలుసునా. మరొకరు చెప్పిన దానిని మీరు పునరుక్తం చేయకండి. గీత, ఖురాను, బైబిలు లోనిదో, మీకు నచ్చిన మరో పవిత్ర గ్రంథం లోనిదో తీసుకొని అదే మళ్ళీ పునరుక్తం చేస్తూ మాట్లాడకండి. ఎందుకంటే అది కూడా ఒక అలవాటుగా నిత్యచర్యగా అయిపోతుంది. దయచేసి ఇది ప్రయత్నించి చూడండి. మీరే కనిపెట్టండి.

పరిశీలించి చూశారంటే మీ జీవితం మహా యాంత్రికంగా అయిపోయిందని మీరే

గ్రహిస్తారు. అది గ్రహించారా? ఈ సమస్యను మనందరం కలసి చర్చిస్తున్నాం. అందరమూ పాలుపంచుకుంటున్నాం. ఇందులో సిగ్గుపడవలసినది ఏమీ లేదు. మీకు నచ్చినా నచ్చకపోయినా వాస్తవం ఇదీ. ఉచితంగా మీకు లభించే ఒకే ఒకటి సెక్స్. అదీ త్వరగానే ఒక అలవాటు కింద మారి పోతుంది కూడా. దీనినంతటినీ మీరు ప్రేమ అని అంటారు. దైవప్రేమను, అసహ్యాకరమైన మీ ఆ గురువు అన్నా, మీ ఆరాధ్య నాయకుడు అన్నా, ఒక ఆదర్శమూర్తి అన్నా మీకు గల భక్తినీ. ఆ గురువు, ఆ ఆదర్శమూర్తి ఎవరో కాదు మీరే. మీ భక్తి అంతా మీ మీదే. ఇదంతా ప్రేమ అని మీరు అంటున్నారు. ఇది ప్రేమేనా? యాంత్రికమైనటువంటి ప్రతి ఒక్కదానినీ మీరు వదిలివేసినప్పుడు మాత్రమే ఇందులో వున్న సత్యం కనబడు తుంది.

ఇక మరణం అనే సమస్యను గురించి మాట్లాడుకుందామా? సమయం ఉన్నదా?

మరణం అంటే ఏమిటి? దీనిని గురించేగా మనందరం విపరీతంగా భయపడిపోతూ వుంటాం. అది ఏమిటి? సరళంగా చెప్పాలంటే, అంతమై పోవడం. 20 సంవత్సరాలో, నలభై, యాభై లేక ఎనభై సంవత్సరాలో నేను బ్రతికాను. ఎంతో సేకరించి నిలవచేసుకున్నాను. ఎన్నో వస్తువులూ, ఎంతో ధనమూ. అందమైన పనులూ చేశాను. (సశేషం)

## అనాసక్తతతో గమనించడం

"నీ మనసును జాగ్రత్తగా గమనించు. ఒక్క ఆలోచన కూడా తప్పించుకొని పోకుండా చూడు. ఆ ఆలోచన ఎంత అసహ్యాకరమైన దైనా, ఎంత క్రూర మైన దైనా సరే. ఇష్టాయిష్ట ప్రసక్తి లేకుండా, తూకం వేసి బలాబలాలు లెక్కించ కుండా, తప్పొప్పులు నిర్ణయించ కుండా, ఒక దిశలో నడమని నిర్దేశించ కుండా, మనసులో అది వేర్లు తన్నుకొని స్థిరపడ కుండా ఆలోచనలను గమనిస్తూ వుండు."

## జీవితం నదివంటిది

"నీలాకాశం ఎంత స్వచ్ఛంగా, ఎంత విశాలంగా ఉన్నది! దానికి కాలంతో పని లేదు. అసీమితంగా పరచుకొని ఉన్నది. స్థలము, దూరము అనేవి మనసుకు సంబంధించినవి. అక్కడ, ఇక్కడ అనేవి వాస్తవాలే. కోరిక చేసే ఒత్తిడివలన అవి మనోప్రపంచపు అంశాలవుతాయి. మనసు చాలా విచిత్రమైనది. ఒక అద్భుతం అది. మహాసంక్లిష్ట పూరితమైనది. మళ్ళీ నిజంగా చూస్తే చాలా సరళమైనది కూడా. అనేకమైన మానసిక నిర్బంధాల కారణంగా మనసు సంక్లిష్టంగా చేయబడుతున్నది. ఇదే సంఘర్షణకు, బాధలకు, ప్రతిఘటనకు, ఆర్జించి స్వంతం చేసుకోవడాలకు దారి తీస్తుంది. ఇవి తెలుసు కుంటూ, వాటిలోపడి చిక్కుకొని పోకుండా, వాటి దారిన వాటిని పోనిస్తూ వుండటం కఠినమే. శ్రమే. సువిశాలంగా పరచుకొని ప్రవహించి పోతున్న నది వంటిది జీవితం. మనసు తన వలను పరచి, ఈ నదిలోని విషయాలను చిక్కించు కుంటుంది. కొన్నింటిని వదలి వేస్తుంది. కొన్నింటిని పట్టి వుంచుకుంటుంది. ఆ వల అనేదే వుండకూడదు. వల కాలానికి, స్థలానికి సంబంధించినది. ఈ వల ఇక్కడను, అక్కడను, సంతోషాన్నీ విచారాన్నీ తయారు చేస్తున్నది.

---

*Published in August, December & April.*
*Registered with the Register of Newspapers for India under No. TNTEL/2006/19442*

**Statement about ownership and other particulars of Antharanga Yatra**

**FORM IV**

| | | |
|---|---|---|
| 1. Place of Publication | : | Krishnamurthi Foundation India<br>Vasanta Vihar<br>124, 126 Greenways Road<br>Chennai - 600 028. |
| 2. Periodicity of publication | : | Once in four months (August, December and April) |
| 3. Printer's name | : | N. Subramanian |
| Whether Citizen of India | : | Yes |
| Address | : | Sudarsan Graphics<br>Offset Press<br>27, Neelakanda<br>Mehta Street,<br>T. Nagar<br>Chennai - 600 017. |
| 4. Publisher's name | : | Dr. V. Aravind |
| Whether Citizen of India | : | Yes |
| Address | : | Anugraha<br>Flat No.2,<br>Old No. 26, New No. 51,<br>Fourth Trust Cross Street,<br>Mandavelli<br>Chennai - 600 028. |
| 5. Editor's Name | : | K. Krishnamurthy |
| Address | : | Krishnamurti<br>Foundation India<br>Vasanta Vihar<br>124, 126 Greenways Road,<br>Chennai - 600 028. |
| 6. Name and address of individuals who own the newspaper and partners or shareholders holding more than one per cent of the local capital. | : | Krishnamurti<br>Foundation India<br>Vasanta Vihar<br>124, 126 Greenways Road<br>Chennai - 600 028. |

I, Dr. V. Aravind, hereby declare that the particulars given are true to the best of my knowledge and belief.

(V. Aravind)

*If undelivered please return to :*
KRISHNAMURTI FOUNDATION INDIA
Vasanta Vihar, 124, 126 (Old 64, 65) Greenways Road
Chennai - 600 028. Tel : 24937803/24937596
E-mail : publication@kfionline.org
Websites : www.kfionline.org / www.jkrishnamurti.org

*Publishe by Dr. V. Aravindon behalf of the Krishnamurti Foundation India, Vasanta Vihar, 124, 126 (Old 64, 65) Greenways Road, Chennai - 600 028. Printed by N. Subramanian at Sundarsan Graphics Offset Press, 27, Neelakanta Mehta Street, T. Nagar, Chennai - 600 017. Editor : K. Krishnamurthy*